క్లుప్తంగా

18న నవరాత్రి దీక్షాధారణలు

శ్రీకాకుళం కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18న నవరాత్రి దీక్షా మాలాధారణ వేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఇప్పిలి హరనాధరావు సోమవాకరం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు చవితి పూజ, మహానైవేద్యం, అష్ట ద్రవ్యాలతో గణపతి హోమం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ముందురోజు 17వ తేదీన ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు ఉదయం 10 గంటల నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

200 మందికి ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలను అందజేస్తున్న సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి దూరప్రాంతాల నుంచి వచ్చిన 200 మందికి హెబీ కాలనీలోని సత్యసాయి భజన మండలి సభ్యులు ఆహార పొట్లాలను అందజేశారు. సేవా సమితి కన్వీనర్ భాస్కర్, సేవాదల్ సభ్యులు సతీష్ చౌదరి, రమేష్, కష్ణమూర్తి, మెండ భాస్కర్, మూర్తి మాస్టర్, జిల్లా స్కిల్ డేవలప్‌మెంట్ ఇన్‌చార్జి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: కూరగాయల సాగులో సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. జి.సిగడాం గ్రామానికి చెందిన రైతు పిన్నింటి నారాయణరావుకు చెందిన మెట్టు పంట పొలంలో సేంద్రియ ఎరువుల తయారీపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. సహజ వనరులను వినియోగించి వివిధ రకాల ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకుంటే సుస్థర వ్యవసాయంతో సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేసుకుంటే తక్కువ పెట్టిబడి, అధిక దిగుబడులు సాధించగలమన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సమీరా ఉన్నారు.

బీమాపై అవగాహన



వెల్బురాయిలో మాట్లాడుతున్న సీతారాం

రణస్థలం: జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లతో పాటు కీలకంగా పనిచేస్తున్న గృహసారథులకు రూ. 5 లక్షల బీమా నమోదు చేస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం అన్నారు. వెల్బురాయి, అర్జునవలస, సంచాం గ్రామ సచివాలయాల్లో గృహసారథులు, వలంటీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో గృహసారథుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, ఆయా పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లవలసలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: ఫ్యామిలీ డాక్టరు విధానంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు అన్నారు. తాళ్లవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు విధానంలో భాగంగా వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టరు మణిభూషణ్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

లావేరు: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని తాళ్లవలస సచివాలయం ఎంఎస్‌కే ఎస్.కామేశ్వరీ అన్నారు. స్థానిక అంగన్‌వాడే కంద్రాన్ని సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. పిల్లలకు పెడుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని కార్యకర్త ఎం.వెంకటలక్ష్మికి సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే సీఎం జగన్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా ఆయన్ని గెలిపించుకోవడానికి ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సైనికులా పని చేయాలని పిలుపునిచ్చారు. సీతంపేట గ్రామంలో కార్యకర్తలతో ఆత్మీయ కలయిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అన్నివిధాలుగా అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కారం చేసే దిశగా పని చేస్తున్నామన్నారు. ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జనాల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదలకు మేలు జరగుండా ఉండేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని.. వాటిని పార్టీ కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు తిప్పి కొట్టాలన్నారు. అనంతరం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాంగా నిర్వహించిన భూసర్వే ద్వారా మంజూరు చేసిన భూ హక్కు పత్రాలను రైతులకు కిరణ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, సర్పంచ్ గేదెల మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యుడు గెదేల నారాయణరావు, పార్టీ నాయకులు బాలి అప్పలసూరి, ఇల్లాక రాములు, బైరెడ్డి విష్ణు, గేదెల రమణ, పాగిరి అప్పలనాయుడు, లోలుగు సూరిబాబు, శాసపు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వైదేహి, వీఆర్వో ఎర్రకయ్య పాల్గొన్నారు.

ఆనందపురంలో మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు అవ్వడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఈనెల ఏడో తేదీన గుంటూరు నుంచి ఆనందపురం గ్రామానికి వచ్చిన గొర్లె సాయికుమార్‌కు జర్వంతో రావడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేశారు. డెంగ్యూగా నిర్ధారణ కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. దీంతో జిల్లా మలేరియా నివారణాధికారి సత్యన్నారాయణ, స్థానిక వైద్యులు యశ్వంత్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ చిత్తిరి మంజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్ సమక్షంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సబ్ యూనిట్ ఆధికారిణి సురేష్, హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, పేడాడ సత్తిరాజు, ఏఎన్ఎం యందమూరి నాగమణి, ఎం.ఎల్.ఎస్.పి.రమ ఉన్నారు.

కుక్కలు స్వైర విహారం



జి.సిగడాంలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

జి.సిగడాం: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పాలఖండ్యాం, జి.సిగడాం, పెంట, బాతువ, ముషినివలస, చెట్టుపొదిలాం, డి.ఆర్.వలస తదితర గ్రామాల్లో కుక్కలు విచ్చల విడిగా సంచరిస్తూ మనుషులు, పశువులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల శాంతియుత ప్రదర్శనపై పోలీసులు విచక్షణారహితంగా దాడులు చేయడం పట్ల శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తీవ్రంగా ఖండించారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు పునరావతం కాకుండా న్యాయపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, భాస్కరరావు, కూన అన్నంనాయుడు, శిష్టు రమేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓబీసీ సాధనే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న శిష్టకరణ సంఘ నాయికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ శిష్టకరణ సంఘ నాయకులు కృషి చేస్తున్నారని, ఆ దిశగానే మరో అడుగు ముందుకేసి ఢిల్లీకి పయనమవుతున్నామని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ నెల 13వ తేదీన ఢిల్లీలో కస్తూర్బా రోడ్డులో గల మహారాష్ట్ర భవన్‌లో జాతీయ బీసీ కమిషన్ నిర్వహించనున్న పబ్లిక్ హియరింగ్‌కు ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం ప్రతినిధులు హాజరై తమ విన్నపాన్ని తెలియజేస్తారన్నారు. ఈ మేరకు ఢిల్లీ వెళ్లే ముందు ఓ ప్రైవేట్ గృహంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడిన శిష్టకరణాలను బీసీ జాబితాలో చేర్చేందుకు అవసరమైన అఫిడవిట్లను తయారు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, సంఘ పట్టణ అధ్యక్షుడు బెహరా రామచంద్రరావు, కల్లేపల్లి వెంకటేశ్వరరావు. ఏపీ విజయనారాయణరావు, మనిపాత్రుని జోగారావు, అల్లిన రాధాకృష్ణ, శ్రీరామ్‌కుమార్, బలివాడ మల్లేశ్వరరావు, ఎస్.వి.డి మురళి, పొన్నాడ మోహన్‌రావు, డబ్బీరు వెంకటరావు, పక్కి సీతారామస్వామి పాల్గొన్నారు.

బంద్ విఫలం



టీడీపీ నాయకుడు నవీన్ షాప్ తెరిచి ఉన్న దృశ్యం



బంద్ ప్రభావం లేకపోవడంతో యథావిధిగా షాపులు తీసిన వ్యాపారులు

శ్రీకాకుళం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో అరెస్టు అయిన నేపథ్యంలో ఇది అక్రమం అంటూ ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బంద్ ప్రభావం శ్రీకాకుళం పట్టణంలో కానరాకుండా పోయింది. బస్సులు యథావిధిగా తిరిగాయి. దుకాణాలు, ఇతర వ్యాపార కేంద్రాలు ఎప్పటిలాగానే తెరుచుకున్నాయి. ఎప్పటి నుంచో పార్టీ విధి, విధానాలు, అధినాయకుడు అనుచరిస్తున్న విధానాల పట్ల విసిగి ఉన్న ఆ పార్టీ కేడర్ బంద్‌లో పాల్గొనేందుకు అంతగా ఆసక్తి చూపలేదు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రూరల్ మండల అధ్యక్షుడు సీర రమణ, చిట్టి మోహన్ తదితరులు సోమవారం వేకువ జామున ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. వీరితో పది మంది నాయకులు, కార్యకర్తలు కూడా లేరు. పోలీసులు వీరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన మినహా పట్టణంలో మరేక్కడా బంద్, నిరసన, ఆందోళన కార్యక్రమాలు కనిపించలేదు. టీడీపీ నాయకులకు చెందిన దుకాణాలు, షాపులు యథావిధిగా తెరుచుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దంపతులను, టీడీపీ నాయకుడు గొండు శంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడుకు సమీప బంధువు తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు అచూకీ లేకుండా పోయింది. వీరంతా ఇళ్లకే పరిమితమైతమని హౌస్ అరెస్టు చేశారని చెప్పుకోవటంలో వాస్తవం లేదన్నది స్వయంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు టెలీకాన్ఫరెన్స్ వ్యాఖ్యల్లోనే అర్థం అవుతుంది.

యథావిధిగా జనజీవనం

గార: గార మండలంలో సోమవారం ఉదయం నుంచే జనజీవనం యథావిధిగానే ఉంది. ఉదయం సరికే అన్ని దుకాణాలు, బస్సులు, స్కూళ్లు తెరుచుకున్నాయి. ఉదయం 11 గంటల తర్వాత కొద్ది మంది టీడీపీ శ్రేణులు మండల కేంద్రంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద బస్సులు ఆపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం 15 మంది కార్యకర్తలు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచి టీడీపీ చేపట్టిన బంద్‌కు ప్రజల నుంచి ఏమాత్రం స్పందన కానరాకపోవడంతో టీడీపీ శ్రేణులు నిరుత్సాహం చెందాయి.

కానరాని బంద్

ఎచ్చెర్ల క్యాంపస్: టీడీపీ ఇచ్చిన రాష్ట్ర బంద్ ప్రభావం ఎచ్చెర్ల మండలంలో ఏమాత్రం కనిపించలేదు. పాఠశాలలు, కళాశాలలు యాథావిధిగా పని చేశాయి. దుకాణాలు, షాపులు కూడా ఉదయం నుంచే తెరుచుకున్నాయి.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు పక్కనుంచి వెళ్తున్న బస్సులు



గార: మండల కేంద్రంలో తెరుచుకున్న దుకాణాలు

లావేరు: లావేరు మండలంలో కూడా బంద్ జరగలేదు. టీడీపీ నాయకులు వ్యాపార సంస్థలు, పాఠశాలల వద్దకు వెళ్లి బలవంతంగా మూయించాలని చూసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. యథావిధిగా పని చేశాయి. వాహనాలన్నీ తిరిగాయి.



స్పందన కార్యక్రమంలో భాగంగా అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసుల భద్రత నడుమ బస్సును పంపిస్తున్న దృశ్యం

స్కిల్‌డెవలప్‌మెంట్ పేరిట దోపిడీ



మాట్లాడుతున్న రాష్ట్ర అగ్రిమిషన్ మెంబర్, ఎంపీపీ గొండు రఘురామ్, పార్టీ నాయకులు

గార: స్కిల్‌డెవలప్‌మెంట్ పేరిట యువతను మోసగించడంతోనే చంద్రబాబుకు న్యాయస్థానం రిమాండ్ విధించిందని రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు, గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. అంపోలులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాధనం కాపాడటం ప్రభుత్వ బాధ్యతని, ఆ విధంగానే సీఐడీ చట్టపరమైన దర్యాప్తు జరిపి చంద్రబాబును కోర్టు ముందు ఉంచటం జరిగిందన్నారు. స్కిల్ పేరిట ఎంత దోపిడీ జరిగింది, ఏ విధంగా జరిగిందన్నది పూర్తి వివరాలు సీఐడీ సేకరించడంతోనే కేసు నిరూపితమైందన్నారు. టీడీపీ నాయకులు, మాజీ మంత్రులు ఇప్పటివరకు ఈ కేసులో చంద్రబాబుకు ఏమాత్రం ప్రమేయం లేదని చెప్పకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుపై 26 కేసులున్నా, అన్నింటిపై స్టేలు తెచ్చుకోవడం తప్పా నిర్దోషిగా బయటపడలేదన్నారు. చంద్రబాబు టీడీపీని ఏ విధంగా ఎన్టీఆర్ నుంచి లాక్కున్నారో అందరికీ తెలుసున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముంజేటి కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, పీస గోపి, జేసీఎస్ ఇన్‌చార్జి కొయ్యాన నాగభూషణం, శిమ్మ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌పై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న రమణమూర్తి

రణస్థలం: వచ్చేనెల రెండు నుంచి నవంబర్ ఎనిమిదో తేదీ వరకూ జరగనున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో బి.వి.రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లు దాటిన యువతి, యువకులు ఆడుదాం ఆంధ్రాలో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. తొలుత గ్రామ సచివాలయం స్థాయిలో, అక్కడ నుంచి మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని చెప్పారు. ఇందులో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ ఆటలు ఉంటాయని చెప్పారు. త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతోందన్నారు. మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో నిత్యం వచ్చే స్పందన పిర్యాధులు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. స్పందధనలో వచ్చిన ప్రతీ ఫిర్యాదు 24 గంటలలోపు సమగ్రంగా పరిశీలించి సమస్య పరిష్కారించాలన్నారు. సమావేశంలో ఏవో వి.ధనుంజయరావు, ఈవోపీఆర్‌డీ ప్రభాకర్‌రావు ఉన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు



గార: హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులకు సూచనలు చేస్తున్న పి.సుందరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం అర్బన్ మండల పరిధిలో అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం అర్బన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. తొమ్మిది క్రీడాంశాలలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఎంపిక పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు పి.సుందరరావు మాస్టారు ప్రారంభించారు. ఎం.సాంబమూర్తి, బీవీ రమణ, కె.మాధవరావు తదితరుల పర్యవేక్షణలో పీడీలు, పీఈటీలు ఎంపికలను నిర్వహించారు.

గార మండలంలో..

గార: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శ్రీకూర్మం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో 300 మంది అబ్బాయిలు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, బాల్ బాడ్మింటన్, బాడ్మింటన్, టెన్నికాయిట్ రంగాల్లో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీపడ్డారు. గెలుపొందిన విద్యార్థులను మండల స్థాయి టీమ్‌లను వేర్వేరు అంశాల్లో ఎంపిక చేశారు. త్రోబాల్, యోగాలో కూడా మండల టీమ్‌లు ఎంపికయ్యాయి. మరికొద్ది రోజుల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో మండల టీమ్‌లు పాల్గొంటాయని పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి తెలిపారు. మంగళవారం ఇదే ప్రాంగణంలో అమ్మాయిల పోటీలు జరగనున్నాయని తెలిపారు. కృష్ణారావు, మండల సమన్వయకర్త టి.శ్రీనివాసరావు, ఎస్.రమణ క్రీడలను పర్యవేక్షించారు.

ఓటర్ల నమోదు ప్రక్రియలో బిజీబిజీ



కొత్త ఓట్ల నమోదు ప్రక్రియలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: నూతన ఓట్ల నమోదు ప్రక్రియలో శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు. ఈ నెల 15వ తేదీ లోగా ఓటర్ జాబితాలన్నీ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాల జారీ చేశారు. దీంతో శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.వెంకటరావు పర్యవేక్షణలో ఓట్ల నమోదు కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిచేశారు. నమోదు చేసిన ఓట్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆయా సచివాలయాల వారీగా తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్‌లో ఎంట్రీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫారం-6 కొత్త ఓట్ల నమోదు, ఫారం-7 మృతుల ఓట్ల తొలగింపు, ఫారం-8 కరక్షన్‌లు, రీప్లేస్‌మెంట్ చేస్తున్నారు.